

నిట్‌లో పిహెచ్‌డి, ఎంఎస్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎపి నిట్‌లో 2023 డిసెంబర్ సెషన్‌కు సంబంధించి పిహెచ్‌డి, ఎంఎస్ కోర్సులకు అర్హులైన ఫుల్‌టైమ్, పార్ట్ టైమ్ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎపి నిట్ డీన్ (అకడమిక్) డాక్టర్ టి.కురుమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫుల్‌టైమ్ అభ్యర్థులు మాస్టర్ డిగ్రీతోపాటు గేట్‌లో తప్పనిసరిగా అర్హత సాధించాలని పేర్కొన్నారు. పార్ట్‌టైమ్ అభ్యర్థులు మాస్టర్ డిగ్రీతోపాటు ఏదైనా అకడమిక్ ఇనిస్టిట్యూట్‌లోగాని, పరిశ్రమలోగాని రెండేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు డిసెంబర్ ఒకటో తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమ సంస్థలోని 12 విభాగాలకు సంబంధించి మొత్తం 52 పిహెచ్‌డి సీట్లు ఉన్నాయని అడ్మిషన్ల అధికారి డాక్టర్ పి.తపస్ తెలిపారు. దీనిలో ఫుల్‌టైమ్ 42, పార్ట్ టైమ్ 10 చొప్పున ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులను రాత పరీక్ష, ముఖాముఖి ద్వారా ఎంపికచేస్తామని, ఇతర వివరాలకు ఎపి నిట్ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

రబీ నాట్లు సకాలంలో పూర్తయ్యేనా..!

ఇప్పటికీ సరిగా ప్రారంభం కాని నారుమడుల ప్రక్రియ

నవంబర్ నెలాఖరుకు నారుమడులు వేయాలన్న లక్ష్య సాధన కష్టమే

రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షలకుపైగా ఎకరాల్లో వరిసాగు

నాట్లు ఆలస్యమైతే సాగునీటి ఇబ్బందులతో రైతులకు అగచాట్లే

వంతులవారీ విధానంలో రబీకి సాగునీటి ప్రణాళిక



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీనాట్లు సకాలంలో పూర్తయ్యేనా అనే అనుమానం నెలకొంది. అధికారులు చెబుతున్న ప్రణాళికకు జరుగుతున్న పరిస్థితికి సంబంధం లేకుండాపోయింది. నవంబర్ పూర్తవుతున్నా ఇంకా రబీ నారుమడులు ముమ్మరంగా ప్రారంభం కాకపోవడంతో నాట్లు ఎప్పటికి పూర్తయ్యేనో అనే అనుమానాలు నెలకొన్నాయి. ఈ నెల 14, 15 తేదీల్లో రెండు జిల్లాలోనూ సాగునీటి సలహామండలి సమావేశాలు జరిగాయి. రబీ సాగుకు పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయాలని సాగునీటి సలహామండలి సమావేశాల్లో నిర్ణయించారు. పూర్తిస్థాయిలో నీరు అందుబాటులో లేకపోవడంతో వంతులవారీ విధానంతోపాటు పలు చర్యలు చేపట్టి సాగునీరు అందించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 4.60 లక్షల ఎకరాల్లో రబీలో వరి సాగవుతుండగా, ఏలూరు జిల్లాలో 56,190 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 2.40 లక్షల ఎకరాల వరకూ రబీ సాగు సాగనుంది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని 8,96,507 ఎకరాలకు 91.35 టిఎంసిల నీరు అవసరమని అధికారులు తేల్చారు. అయితే గోదావరి ప్రవాహాల ద్వారా వచ్చే నీటి లభ్యత 30 టిఎంసిలు, సీలేరు నుంచి 40.49 టిఎంసిలు, పోలవరం ప్రాజెక్టులో నీటినిల్వలు 12 టిఎంసిలు మొత్తం 82.49 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. దాదాపు పది టిఎంసిల నీరు లోటు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. మొత్తం సాగుకు నీరు అందించాలంటే వంతులవారీ విధానం, ఆయిల్ ఇంజిన్ల ద్వారా నీటిని ఎత్తిపోయడం, డ్రెయిన్లపై అడ్డుకట్టలు వేయడం ద్వారా సాగునీరు అందించాలని సాగునీటి సలహామండలి సమావేశంలో తీర్మానించారు. అందుకుగాను నవంబర్ నెలాఖరుకు నారుమడులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి డిసెంబర్ నెలాఖరుకు నాట్లు పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. మార్చి నెలాఖరున కాలువలు మూసివేయాలనే నిర్ణయం సైతం జరిగింది. అయితే ఇప్పటికీ రెండు జిల్లాల్లోనూ నారుమడులు ప్రారంభంకాని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ మాసూళ్లు ఇంకా 60 శాతంపైగా పూర్తికాని పరిస్థితి ఉంది. ఖరీఫ్ మాసూళ్లు పూర్తయ్యి రబీ నారుమడులు పూర్తయ్యేసరికి చాలా సమయం పట్టే పరిస్థితి కన్పిస్తోంది. రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు సైతం సరైన ప్రణాళికలు రూపొందించలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. నారుమడులు ఆలస్యమైతే జనవరి నెలాఖరు వరకూ రబీ నాట్లు కొనసాగే పరిస్థితి రానుంది. అదే జరిగితే రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. జనవరి వచ్చేసరికి గోదావరి జలాలు మరింత తగ్గిపోతాయి. వంతులవారీ విధానం ప్రారంభమవుతుంది. శివారు పొలాలకు సాగునీటి పంపిణీ కష్టతరంగా మారనుంది. అదే జరిగితే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి రానుంది. రైతులకు అవగాహన కల్పించి రబీ నారుమడుల డిసెంబర్ పదో తేదీలోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటేనే రబీసాగు సాఫీగా సాగే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేకపోతే సాగునీటి ఇబ్బందులు తలెత్తి పంట దెబ్బతినే ప్రమాదం ఏర్పడనుంది. ఇప్పటికైనా అధికారులు అందుకు తగిన చర్యలు తీసుకుంటే రైతులకు మేలు జరుగుతుంది. ఇప్పటికే ఖరీఫ్ పంటను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డ రైతాంగం రబీలోనూ కష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఎస్‌సి, ఎస్‌టిలపై నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఎస్‌సి, ఎస్‌టిలపై అఘాయిత్యాలు, నేరాలు నిరోధించేందుకు సంబంధిత అధికారులు, సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో పౌర హక్కుల రక్షణ, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు అట్రాసిటీ నిరోధక చట్టాల అమలు తీరుపై సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులతో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి సమావేశంతోపాటు డివిజన్‌స్థాయిలో కూడా సమావేశాలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారం ఆలస్యమైనా, పరిష్కారం కాకపోయినా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. క్రిమినల్ కేసు విషయంలో బాధితులకు ఎంతవరకు నష్టపరిహారం అందించగలమో అంత పరిహారం అందిస్తామని తెలిపారు. గతంలో ఎస్‌సి, ఎస్‌టిలకు గ్రీవెన్స్ డే నిర్వహించామని, అయితే ఒకటి, రెండు కేసులు మాత్రమే వచ్చాయని చెప్పారు. దీంతో ఆ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు తెలిపారు. సభ్యులు కోరిక మేరకు నెలకోసారి ఎస్‌సి, ఎస్‌టి గ్రీవెన్స్ డే నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 15,367 ఎకరాల అసైన్డ్ భూమి ఉందని, 20 సంవత్సరాలకుపైగా అనుభవిస్తున్న వారికి భూహక్కు పత్రాలు అందిస్తున్నామని తెలిపారు. దీనివల్ల ఎక్కువగా ఎస్‌సి, ఎస్‌టిలకు లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ మాట్లాడుతూ వివిధ విభిన్న కారణాలతో కేసులు నమోదవుతున్నాయన్నారు. కొన్ని కేసులు కొన్ని రోజుల్లోనే పరిష్కారమవుతాయని, కొన్ని కేసులు సాక్షులు విచారించినప్పుడు, కోర్టుల్లో పెండింగు ఉండటం వల్ల ఆలస్యమవుతుందని చెప్పారు. కమిటీ సభ్యులు జిల్లెల్ల సత్య సుధామ, పొన్నమండ బాలకృష్ణ, సిఎం మంగరాజు, టి.జగ్జీవనరావు, సింగం త్రిమూర్తులు, ఆహ్వానితులు సిహెచ్‌విఆర్.భరత్ మాట్లాడారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, భీమవరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కె.చెన్నయ్య, డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, దిశ యాక్టు డిఎస్‌పి ఎన్.మురళీకృష్ణ, డిఎస్‌పిలు బి.శ్రీనాథ్, జివిఎస్.పైడేశ్వరరావు, సి.శరత్ రాజ్‌కుమార్, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, జిల్లా కోపరేటివ్ ఆడిట్ కార్యాలయం డిప్యూటీ రిజిస్ట్రార్ ఎ.అంబేద్కర్, జిల్లా ఆర్‌అండ్‌బి అధికారి బి.లోకేశ్వరరావు, జిల్లా పరిశ్రమల అధికారి యు.ఆదిశేషు, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

క్లెయిముల పరిశీలనను త్వరితగతిన పరిష్కరించాలి

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా క్లెయిముల పరిశీలనను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా డ్రాఫ్ట్ పబ్లికేషన్ పెండింగులో ఉన్న దరఖాస్తుల స్థితి, ప్రత్యేకంగా 30 రోజులకుపైగా పెండింగులో ఉన్న ఫారాలు, ఎస్ఎస్ఆర్ సమయంలో స్వీకరించిన ఫారాలు, అనోమలిస్ పెండింగ్, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, రాజకీయ పార్టీల పెండింగ్ ఫిర్యాదులు, ఈ రోల్‌పై రిపోర్టులు, ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీ, పిఎస్ఇలు, డిఎస్ఇలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, భీమవరం ఆర్‌డిఒ బి.శ్రీనివాసులురాజు, ఇఆర్‌ఒలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి క్లెయిములను పకడ్బందీగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో పెండింగులో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను అత్యధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. పెండింగులో ఉన్న దరఖాస్తులను పరిశీలించడంలో జాప్యం చేయకూడదన్నారు. పోలింగ్ స్టేషన్లవారీగా రెండు శాతం అదనంగా తొలగింపులు చేసి ఉంటే వాటిని పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఆర్‌ఒలు ఎస్‌టివి రాజేశ్వరరావు (డ్వామా పీడీ), జివికె.మల్లికార్జునరావు (డిపిఒ), ఎ.దుర్గేష్ (జిల్లా హార్టికల్చర్ అధికారి), జెడ్.వెంకటేశ్వరరావు (జిల్లా వ్యవసాయ శాఖాధికారి), ఎన్నికల సూపరింటెండెంట్ టిఎల్ఎస్ఎస్.ప్రసాద్, ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

కొల్లేరు సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

కొల్లేరు సరస్సు కాంటూర్లు, అభయారణ్య నిర్వహణకు సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత సర్వే బృందానికి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, లేడర్ సర్వే టీమ్, రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే శాఖల అధికారులతో సమావేశమై కొల్లేరు కాంటూర్లు, అభయారణ్యాల నిర్వహణకు చేపట్టిన సర్వేపై సమీక్షించారు. ఐదో కాంటూరు, పదో కాంటూరు మ్యాపులను త్వరితగతిన సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం కాంటూర్లు నిర్ణయించడానికి వచ్చిన హెలికాప్టర్ టెక్నాలజీ సిబ్బందితో ఎన్ని రోజుల్లో ఈ సర్వే పూర్తి చేస్తారు, డేటా ఎప్పుడిస్తారు అనే విషయంపై చర్చించారు. అదేవిధంగా కొల్లేరు ప్రాంతాన్ని పరిరక్షించడానికి ఎన్ని కిలోమీటర్లు నిర్ణయించాలి, గణపవరం, కాళ్ల, ఉండి మండలాల్లో ఎక్కడ వరకు గుర్తించాలి అనేది పరిశీలించాలన్నారు. లేడర్ సర్వే త్వరితగతిన పూర్తి చేయడానికి సర్వే, రెవెన్యూ శాఖల సహకారం తీసుకోవాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనల ప్రకారం జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధ్యాయునికి 15 రోజులు రిమాండ్

ప్రజాశక్తి - ఉండి

విద్యార్థినిని ప్రేమ పేరుతో వంచించి అత్యాచారం చేసిన ఉపాధ్యాయుడు పురెల్ల సోమరాజును పోలీసులు శుక్రవారం భీమవరం కోర్టులో హాజరుపర్చారు. కోర్టు సోమరాజుకు 15 రోజులు రిమాండ్ విధించిందని ఆకివీడు సిఐ కెవివిఎన్.సత్యనారాయణ తెలిపారు.

3 నుంచి అగ్రిటెక్ సదస్సు

ప్రజాశక్తి - ఉండి

స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో డిసెంబర్ 3 నుండి 5వ తేదీ వరకు నిర్వహించే అగ్రిటెక్ వ్యవసాయ సదస్సు, సాంకేతిక ప్రదర్శనలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా డిసెంబర్ మూడు నుండి ఐదో తేదీ వరకు మూడు రోజులపాటు అగ్రిటెక్ వ్యవసాయ సదస్సు, సాంకేతిక ప్రదర్శనలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సులో వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశు సంవర్థక తదితర శాఖలకు సంబంధించిన సాంకేతిక పద్ధతులను ప్రదర్శిస్తారని తెలిపారు. వివిధ పంటల్లో నిష్ణాతులైన ప్రధాన శాస్త్రవేత్తలు జిల్లా వ్యవసాయాధికారులతోపాటు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో వ్యవసాయ సంబంధిత పరిశ్రమల అధిపతులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు మహిళలు, యువ పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు


విద్యార్థులను బాగా చదివించాలి: ఎంఇఒ

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

ఎస్-1 పరీక్షల్లో విఫలమైన విద్యార్థులతో తిరిగి చదివించి ఉత్తీర్ణులను చేయాలని ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఎంఇఒ కార్యాలయంలో పాఠశాల అభివృద్ధి, విద్యాభివృద్ధిపై మండల ఉపాధ్యాయులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు నమోదు చేసుకుని ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. పాఠశాల బయట ప్రత్యేక అవసరాల గల విద్యార్థులను గుర్తించి వారిపేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా హైస్కూల్ హెచ్ఎంలు సాయి సూర్యనారాయణరావు, సాయి శివరామకృష్ణ, సరస్వతి, న్న సూర్యనారాయణ, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు పట్టాభి జయంతి

ప్రజాశక్తి - భీమడోలు




ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య 143వ జయంతిని ఆయన స్వగ్రామమైన గుండుగొలనులో భోగరాజు పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సంఘం ఛైర్మన్ మామిళ్లపల్లి కాళీబాబు, కార్యదర్శి బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు, గ్రామస్తులు సీతారామయ్య వారసులు గుండుగొలను చెరువుగట్టుపై ఏర్పాటుచేసిన పట్టాభి సీతారామయ్య శిలా విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కాళీబాబు మాట్లాడుతూ అప్పట్లో ఆంధ్రాబ్యాంకు గుండుగొలను శాఖ కొనసాగిన సమయంలో అప్పటి బ్యాంకు జాతీయస్థాయి ఉద్యోగులు, ప్రముఖులు సీతారామయ్య స్వస్థలమైన గుండుగొలనులో విద్య, ఆరోగ్యం, వ్యవసాయాభివృద్ధికి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇదేవిధంగా గ్రామాభివృద్ధికి సైతం తమవంతు సహకారం అందజేస్తారని తెలిపారన్నారు. ఆయన సంస్కరణార్థం తన కాలంలో ఆయన వినియోగించిన వివిధ వస్తువులతో స్థానికంగా మ్యూజియం ఏర్పాటు చేస్తామని కూడా హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదని బ్యాంకు అధికారుల దృష్టికి తెచ్చారు. ఆంధ్రులు తమ బ్యాంకుగా చెప్పుకునే ఆంధ్రా బ్యాంకు వివిధ కారణాలవల్ల యూనియన్ బ్యాంక్‌గా మారిపోయిందన్నారు. అంతేకాక ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు సీతారామయ్య గురించి రానున్న తరానికి తెలిసే అవకాశం ఉండదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన గురించి భావితరాలకు తెలిసేందుకు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను శాఖ మేనేజర్, హెచ్.భవాని, సొసైటీ మాజీ ఛైర్మన్ వివివి.భాస్కర్, మాజీ ఎంపిపి సిరిబత్తిన కొండబాబు, మాజీ సర్పంచి చిట్టి రవి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

భూయజమానులకు సర్వహక్కులు శుభపరిణామం

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్


పత్రాలు పంపిణీ చేస్తున్న ప్రసాదరాజు

నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా సమస్యల్లో ఉన్న భూములపై భూయజమానులకు సర్వహక్కులు కల్పించడం శుభపరిణామమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. అసైన్డ్ భూముల లబ్ధిదారులకు పూర్తి యాజమాన్యం 24 ఎన్‌సిపిఆర్‌యుఆర్ 01 భూమి హక్కు పత్రాలను లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. ఆర్‌డిఒ డాక్టర్ అచ్యుత్ అంబరిష్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గంలో 144.5 ఎకరాలకు చెందిన 356 మంది రైతులకు ఒరిజినల్ అసైన్డ్ వారసులకు పూర్తి హక్కు కల్పించామన్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాలు తీర ప్రాంతం కావడం వల్ల ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రతి గ్రామంలోనూ శ్మశాన వాటికల కోసం ప్రభుత్వ భూమి కేటాయిస్తామని, అది లేనిచోట ప్రయివేటు భూమి కొనుగోలు చేస్తామని తెలిపారు. కాళీపట్నం జమీందారీ భూములకు కూడా త్వరలోనే ఒక పరిష్కారం తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి), నరసాపురం జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, ఎంపిపి మైలాబత్తుల సోనీ, తహశీల్దార్లు ఎస్ఎం.ఫాజిల్, జి.అనితకుమారి పాల్గొన్నారు.

రైల్వేగేటును ఢీకొన్న మినీవ్యాన్

వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి - పాలకోడేరు

జాతీయ రహదారిపై ఉన్న రైల్వేగేట్‌ను ఓ మినీ వ్యాన్ ఢీకొనడంతో సుమారు అరగంటకుపైగా ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరం-పాలకొల్లు మార్గంలో శృంగవృక్షంలో శుక్రవారం సాయంత్రం రైలు వస్తుండటంతో గేటు వేస్తుండగా ఓ మినీ వ్యాన్ గేటు దాటే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆ వ్యాన్ గేటును ఢీకొంది. దీంతో గేటు ఒకవైపు విరిగిపోవడంతో ఈ మార్గంలో సుమారు అరగంటకు పైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు ముందుకెళ్లలేక, వెనకెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రైల్వే సిబ్బంది వెంటనే విరిగిన గేటుకి మరమ్మతులు చేసి వాహన రాకపోకలకు అనుమతి ఇవ్వడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో తరచూ రైల్వే గేటు సమస్య తలెత్తడంతోపాటు ఇటువంటి ప్రమాదాలతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రైల్వే ఓవర్‌బ్రిడ్జిని నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

మామిడికి సంపూర్ణ రీతూ కవచ్ బీమా

ప్రజాశక్తి - ఏలూరు

సంపూర్ణ రీతూ కవచ్ రబీ 2023-24లో రాష్ట్ర అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఎఐసి) వారు మామిడి పంటకు బీమా అందిస్తున్నారని ఏలూరు జిల్లా ఉద్యానవన శాఖాధికారి డాక్టర్ ఎస్.రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న రైతులకు కూడా మామిడి పంట నష్ట పరిహారం చెల్లిస్తారని, ఈ పథకంలో రైతులు కట్టాల్సిన, బీమా వివరాలు ఎకరాకు రైతులు చెల్లించాల్సిన రూ.1200, 18 శాతం జిఎస్‌టి కలిపి మొత్తం రూ.1416కు గాను ఎకరాకు రూ.24 వేలు బీమా చేస్తారని తెలిపారు. వచ్చేనెల 15 నుండి 2024 మే 31 మధ్య కాలంలో వర్షపాతం, ఉష్ణోగ్రత గాలిలో తేమ, ఈదురు గాలులకు సంబంధించిన పరిమాణాలను మండల స్థాయిలో గల స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ వాతావరణ పరిక రాల సహాయంతో లెక్కించి, దాన్ని ఈ పథకంలో ముందుగా పొందుపరుస్తారని చెప్పారు. ఈ పరిమాణాల్లో సరిపోల్చి నప్పుడు వచ్చిన తేడా ఆధారంగా నష్ట పరిహారం చెల్లిస్తాం`న్నారు. జిల్లాలో 37,519.14 ఎకరాలు మామిడి పంటను సాగు చేస్తున్నారని, ఇందులో ఆగిరిపల్లి, నూజివీడు, చింతల పూడి, చాట్రాయి, లింగపాలెం, ముసునూరు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో ఉందన్నారు. మరిన్ని వివరాల కోసం మండ ల ఉద్యాన అధికారులను, అగ్రికల్చర్ బీమా కంపెనీ ఆఫ్ ఇండియా అధికారి కల్పన (9618117844)ను సంప్రదించాలని రామ్మోహన్ కోరారు.

తూనికలు, కొలతల శాఖాధికారుల దాడులు

రెండు దుకాణాల్లో సామగ్రి సీజ్

ప్రజాశక్తి - ఆకివీడు


తనిఖీలు నిర్వహిస్తున్న నాగరాజారావు

పట్టణంలోని విద్యుత్ సామగ్రి విక్రయ దుకాణాలపై జిల్లా తూనికలు, కొలతలు విభాగం అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు చేశారు. రెండు దుకాణాల్లో సుమారు రూ.40 వేల విలువైన అనుమతి లేని సామగ్రిని విక్రయిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. మాదివాడకు చెందిన ఎం.కేశవ ఆరు రోజుల క్రితం స్థానికంగా ఒక విద్యుత్ సామగ్రి దుకాణంలో సామాన్లు కొనుగోలు చేశాడు. అయితే అందుకు రశీదు ఇవ్వడానికి దుకాణ యజమాని నిరాకరించాడు. తెల్ల కాగితంపై ధర మాత్రం వేసి ఇచ్చాడని బాధితుడు తెలిపాడు. దీనికి నిరాకరించిన కేశవ వినియోగదారుల సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్యకు ఫిర్యాదు చేశారు. బంగారయ్య, కేశవుల ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారి వివి.నాగరాజారావు నేతృత్వంలో శుక్రవారం దాడి చేశారు. అయితే ఈ విషయం తెలుసుకున్న దుకాణ యజమాని షాపును మూసివేసి పరారయ్యాడు. అయితే అధికారులు ఆ పరిసరాల్లో ఉన్న కొన్ని దుకాణాలపై దాడులు చేశారు. ప్రతి ప్యాకెట్‌పైనా ప్యాక్ చేసిన వ్యక్తి, సంస్థల పేర్లు, చిరునామా, ప్యాక్ చేసిన తేదీలు, ఎంఆర్‌పి స్పష్టంగా ఉండాలని నాగరాజారావు చెప్పారు. కస్టమర్ కేర్ సెల్ నెంబర్, ఇ-మెయిల్ ఐడి వివరాలు స్పష్టంగా ఉండాలన్నారు. ఈ వివరాలు లేని కారణంగా తాము ఆ సామాన్లను సీజ్ చేశామన్నారు. దీనికి సంబంధించిన పరిహారం ప్రభుత్వానికి చెల్లించి వారు రశీదు పొందితే వారి సామాను వారికి తిరిగి ఇచ్చేస్తామన్నారు. లేనిపక్షంలో వారితోపాటు వారికి సరుకులు అమ్మిన కంపెనీతో సహా కలిపి కేసు నమోదు చేస్తామని, సరుకులు న్యాయస్థానంలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఫిర్యాదుదారుడు కేశవ, వినియోగదారుల సంఘాల రాష్ట్ర సమాఖ్య ఉపాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య పాల్గొన్నారు.

26న ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఈ నెల 26న ఆదివారం పక్షవాతం, ఫిట్స్, బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడకు చెందిన డాక్టర్ గోపాళం శివన్నారాయణ, మన హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ డి.సందీప్ వర్మ తదితరులు పాల్గొని వైద్య సేవలందిస్తారన్నారు. భీమవరం చుట్టుపక్కల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు నిర్మించాలని అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - పోడూరు



నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

మండలంలో గోతులతో నిండిన కవిటం నుండి పోడూరూ వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతూ పోడూరులోని సినిమా హాలు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ మండల కేంద్రమైన పోడూరుకు నిత్యం వివిధ పనుల మీద ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ గ్రామాల నుండి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు పునర్నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొంతు శ్రీను, బి.వెంకట్రావు, కాకర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

డిఆర్‌ఒకు సిపిఐ వినతి

ప్రజాశక్తి - భీమవరం


వినతి అందిస్తున్న సిపిఐ నేతలు

వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను యుద్ధప్రాతిపదికన ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో డిఆర్‌ఒ కె.కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడగా నేతలు కలిశెట్టి వెంకట్రావు, ఎం.సీతారాంప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

గుమ్మలూరులో లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి - పోడూరు

నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులనే నినాదంతో పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన గుమ్మలూరులో సర్పంచి సోనియా రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35 లేగ దూడలను రైతులు ప్రదర్శనకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఇఇ జి.ఏసు రత్నం మాట్లాడుతూ లేగ దూడలను శాస్త్రీయ పద్ధతిలో పెంచినట్లయితే వాటిని మంచి పాడి పశువులుగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న దూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మిగిలిన వాటికి ప్రోత్సాహక బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి, ఎడి జాయకర్ జాన్సన్, డాక్టర్ మాధురి పాల్గొన్నారు.



కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన గోపి

కళ్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో ప్రజల అభిరుచికి తగ్గట్టుగా ఆధునిక కళ్యాణ మండపాలు వసతులతో రావడం హర్షణీయమని వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి చెప్పారు. పట్టణంలో అడబాల వెంకటరమణ ఆధ్వర్యంలో ఎ సెలబ్రేషన్ మినీ ఫంక్షన్ హాల్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, వైసిపి సీనియర్ నాయకురాలు కర్రా జయసరిత పాల్గొన్నారు.

ఉపాధి హామీలో సాంకేతికతను ఉపయోగించాలి

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

ఉపాధి హామీలో సాంకేతికను ఉపయోగించి పనులు ఎలా చేయాలో గుర్తించాలని భీమవరం డ్వామా పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీపై సాంకేతికతను ఎలా ఉపయోగించాలనే అంశంపై తణుకు క్లస్టర్ పరిధిలోని పది మండలాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ క్లార్ట్ యాప్ ద్వారా పూర్తయిన పనులను పూర్తిస్థాయిలో పారదర్శకంగా చేసుకోవడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. క్లస్టర్ పరిధిలోని పది మండలాల సిబ్బంది క్షుణ్ణంగా తెలుసుకొని అనుకూలంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వీరాస్వామి పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు ఫ్రీ హోల్డ్ రైట్స్

ప్రజాశక్తి - ఉండి

అసైన్డ్ భూములకు ఫ్రీహోల్డ్ రైట్స్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఉండి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు చేతుల మీదుగా అధికారులు లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ పేదల అధీనంలో ఉన్న అసైన్డ్ భూములకు అన్యాక్రాంతం చేసే హక్కుతోపాటు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం మండలంలోని పెదపుల్లేరు, చిన్నపుల్లేరు, పాములపర్రు, వెలివర్రు గ్రామాలకు సంబంధించి ఎస్‌సి శ్మశానవాటికకు మంజూరైన పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఏడిద శ్రీనివాస్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, అధికారులు పాల్గొన్నారు.

కార్గో వినియోగదారులకు మెరుగైన సేవలు


ప్రజాశక్తి- తణుకు

ఎపి ఆర్‌టిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్గో సేవలు వినియోగదారులకు మరింత చెరువు చేయాలని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బోర్డ్ డైరెక్టర్ ఎ.రాజారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కార్గో కార్యాలయాన్ని ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తణుకు కార్గో డోర్ డెలివరీ మహోత్సవాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్గో ఆదాయం పెంచే అవకాశాలను మెరుగుపర్చుకోవాలన్నారు. అనంతరం గ్యారేజ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఇటీవల గాయపడిన డిపో మేనేజర్ సప్ప గిరిధర్‌కుమార్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామి విగ్రహం బహూకరణ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలో మదన గోపాలస్వామి ఆలయంలో మృత్యుంజయ సహకార పరపతి సంఘం మాజీ ఛైర్మన్ వైట్ల శారదా దేవి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, శేష తల్ప లక్ష్మీనారాయణ స్వామి విగ్రహాన్ని బహూకరించారు. ఆ విగ్రహాన్ని శుక్రవారం మదన గోపాల స్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.



సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఉప సర్పంచి సునీత సాల్మన్‌రాజ్

గరగపర్రులో రూ.38 కోట్ల సంక్షేమ లబ్ధి

ఉప సర్పంచి సునీత సాల్మన్ రాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్లలో గరగపర్రు గ్రామానికి రూ.38 కోట్లు సంక్షేమ లబ్ధి చేకూరిందని పంచాయతీ ఉప సర్పంచి తోకల సునీత సాల్మన్‌రాజు అన్నారు. గరగపర్రులో శుక్రవారం రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ఉప సర్పంచి సునీత సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను, సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన బోర్డును ఉప సర్పంచి సునీత సాల్మన్ రాజు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వైసిపికి అండగా నిలవాలని కోరారు. జెసిఎస్ మండల కన్వీనర్ పాల రాధాకృష్ణ, ఎంపిటిసి షేక్ పాప సాహెబ్ మాట్లాడుతూ గతంలో జరిగిన సంక్షేమ లబ్ధిని ప్రస్తుత వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలను ఒకసారి పరిశీలించుకుని ఏ ప్రభుత్వం ఎక్కువగా ప్రజలకు మంచి చేసిందో గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమ్మిశెట్టి చిన్నబ్బులు, చింతలపాటి సూర్యనారాయణ రాజు, చింతలపాటి బలరామరాజు, తోకల సాల్మన్‌రాజు, పిలిప్, డొల్లా యోనా, వత్సవాయి రామరాజు, కశ్య ప్రసాద్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు బాండ్లు అందజేయాలి : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో ప్రతి బూత్ స్థాయిలో ఓటర్లకు చంద్రబాబు ప్రకటించిన గ్యారంటీ లబ్ధి బాండ్ అందజేయాలని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు కోరారు. పాలకొల్లు ఛాంబర్ బిల్డింగ్‌లో టిడిపి క్లస్టర్-2 సమావేశంలో ఆయన శనివారం మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం కుటుంబంలో ఎంతమంది ఉన్నా ఒకరికే పథకాలు ఇచ్చిందని చెప్పారు. టిడిపి ఆయా కుటుంబంలో ఎందరున్నా అందరికీ గ్యారెంటీగా పథకాలు ఇస్తానని బాండ్ రూపంలో లబ్ధిదారులకు అందిస్తోందని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ అంగర రామ్మోహన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పెచ్చెట్టి చంద్రమౌళి, టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు జివి కర్నేన గౌరు నాయుడు, మహమ్మద్ జానీ, కర్నేన రోజారమణి, ధనాని సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.



పేరుపాలెం, తూర్పుతాళ్లు రహదారిపై గుంతలో నిలిచిన వర్షపునీరు



పాలకొల్లు రూరల్ : అధ్వానంగా ఉన్న రోడ్డు

చూసి అడుగేయ్యి'..!

గోతులమయంగా రహదారులు
వర్షం వస్తే మడుగులే
ప్రజలకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు ధ్వంసమయ్యాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వర్షం పడితే ఆ గుంతల్లో నీరు నిలిచిపోయి మడుగులను తలపిస్తున్నాయి.

గ్రామాలు, మండలాల మధ్య ఉన్న అనుసంధాన మార్గాలు ధ్వంసం కావడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మండలంలోని కాళీపట్నం నుంచి జిల్లా కేంద్రం భీమవరం, మొగల్తూరు నుంచి కొత్తపాలెం, వెంప మీదుగా భీమవరం ఏళ్లే రహదారిదీ అదే పరిస్థితి. దీంతో నిత్యం వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు అసౌకర్యానికి గురవుతున్నారు.

గ్రామాల మధ్య..

మొగల్తూరు నుంచి శేరేపాలెం మీదుగా నరసాపురం గ్రామీణ మండలం కొప్పర్రు వరకూ ఉన్న పంచాయతీరాజ్ శాఖ రహదారి, పేరుపాలెం తూర్పుతాళ్లు, వారుతిప్ప - వెంప, కొత్తట - కోమటితిప్ప, కాళీపట్నం పాతపాడు గ్రామాల మధ్య ఉన్న ఆర్అండ్‌బి రహదారులు ధ్వంసమయ్యాయి. మొగల్తూరు కొత్తపాలెం, కాళీపట్నం, పాతపాడు గ్రామాల మధ్య రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో గుత్తేదారులు వాటి నిర్మాణానికి ముందుకు రావడం లేదు.

రహదారుల నిర్మాణానికి చర్యలు

కిరణ్, డిఇ, ఆర్అండ్‌బిశాఖ, నరసాపురం

రహదారుల నిర్మాణం, మరమ్మతులకు తగు చర్యలు చేపడతాం. రూ.12 కోట్లతో చేపట్టిన కాళీపట్నం పాతపాడు రహదారి నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. పేరుపాలెం, తూర్పుతాళ్లు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తాను.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు నుంచి వెలివల వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రహదారి గుండా వెలివెల గ్రామస్తులు నిత్యం పాలకొల్లుకు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు, ఉద్యోగ రీత్యా పాలకొల్లుకు వెళ్లేవారు ఈ రోడ్డు గుండా ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. పలు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. గోతుల వల్ల వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని తెలిపారు. దీనికితోడు వెన్ను నొప్పి, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రోడ్డును నిర్మించాలని వెలివెల గ్రామస్తులు కోరుతున్నారు.

అప్పారావు ధన్యజీవి : సిపిఎం



అప్పారావు చిత్రపటానికి జోహార్లు అర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన సిపిఎం మండల నాయకులు కిల్లాడి అప్పారావు ధన్యజీవి అని సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. కొణితివాడ ఉత్తరపాలెంలోని బిసి కమ్యూనిటీ హాల్లో కిల్లాడి అప్పారావు 4వ వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. సభకు సిపిఎం ఉత్తరపాలెం శాఖా కార్యదర్శి కేతా జ్యోతిబసు అధ్యక్షత వహించారు. ముందుగా అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడారు. పేద ప్రజల హక్కుల కోసం, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అప్పారావు కృషి చేశారన్నారు. కొణితివాడలోని ప్రభుత్వాసుపత్రి తరలిపోతుంటే అడ్డుకుని ఆసుపత్రి కొణితివాడలోనే ఉండేలా జరిగిన ఉద్యమంలో ఆయన ముందు నిలబడి పని చేశారన్నారు. 40 సంవత్సరాల పాటు సిపిఎం సభ్యుడిగా కొనసాగిన అప్పారావు అనేక ప్రజా సమస్యల పరిష్కారం కోసం తుది శ్వాస వరకూ పనిచేశారని చెప్పారు. రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తన తండ్రి అప్పారావు ఇచ్చిన స్ఫూర్తి ప్రోత్సాహంతోనే ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తున్నానని వివరించారు. సిపిఎం మండల నాయకులు బాలం విజయ్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కొణితివాడ, ఉత్తరపాలెం, నవుడూరు, అండలూరు గ్రామాలకు చెందిన సిపిఎం నాయకులు కడలి వీరన్నశెట్టి, పాలా అజయ్ ఘోష్, పాలా కోటేశ్వరరావు, నున్న బోయిన సత్యనారాయణ, యాళ్ల బండి నారాయణ మూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి పుల్లారావు

27 నుంచి యువగళం

మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే యువగళాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. టిడిపి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో 15 నియోజకవర్గాల ఇన్‌ఛార్జుల సమావేశం శుక్రవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి పార్టీ కార్యాలయంలో జోన్-2 ఇన్‌ఛార్జి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ ఇంటింటికీ భవిష్యత్ కార్యక్రమాన్ని బాగా నిర్వహించాలన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట.సీతారామలక్ష్మి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో 15 సీట్లు టిడిపి, జనసేన గెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంటు ఇన్‌ఛార్జి గన్ని వీరాంజనేయులు, రాజమండ్రి జిల్లా ఇన్‌ఛార్జి కె.జవహర్, ఎంఎల్‌ఎ రామరాజు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి పట్టణ కార్యకర్తలు పలువురు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. 17వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి రెడ్డి సత్తిబాబు, భీమవరం నాయి బ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షులు, వైసిపి నాయకులు తుంపాల శ్రీనివాస్ వారి అనుచరులతో సుమారు 100 మంది ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొటికలపూడి గోవిందరావు సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. గోవిందరావు మాట్లాడారు. భీమవరంలో అభివృద్ధి ఎక్కడా కానరావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చనమల చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకర రవి, బండి రమేష్ కుమార్, నేతలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ రక్షిత నీరు

ప్రజాశక్తి - కాళ్ల



శంకుస్థాపన చేస్తున్న పివిఎల్ నరసింహరాజు

జల్ జీవన్ మిషన్‌తో ప్రతి కుటుంబానికీ సురక్షిత తాగు నీరు అందించాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్. నరసింహరాజు అన్నారు. కోపల్లెలో జల జీవన్ మిషన్ పథకం ద్వారా సుమారు రూ.34.23 లక్షలతో జగనన్న హౌసింగ్ కాలనీలో ఏర్పాటు చేస్తున్న పైప్ లైన్ విస్తరణ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ సురక్షిత నీరు అందించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాయన్నారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి.శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి పి.సోమేశ్వరరావు, దంతులూరి కోటి, వేగేశ్న రవిరాజు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ప్రజలు ఇప్పటికే గుర్తించారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 11, 12వ వార్డుల్లో రూ.66 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో భీమవరంలో జరిగిన అభివృద్ధి ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రతి వార్డులో కూడా ప్రజల కోరిక, సూచనల మేరకు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అమృత్ పథకంలో పట్టణంలో మూడు రిజర్వాయర్లను నిర్మించుకున్నట్లు తెలిపారు. త్వరలోనే వాటిని వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. నేడు పట్టణ ప్రజలకు, భీమవరం నియోజకవర్గ ప్రజలకు జిల్లాస్థాయి అధికారులు అందుబాటులో ఉన్నారన్నారు. ఇదంతా తమ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఎంఇ త్రినాధరావు, నాయకులు తోట భోగయ్య, యర్రంశెట్టి చందు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ మహిళ నిరసన

ప్రజాశక్తి - ఆచంట



ప్రియుడి ఇంటి ముందు నిరసన తెలుపుతున్న వెంకటలక్ష్మి

పెళ్లి కాలేదని మాయమాటలు చెప్పి తనను రెండో వివాహం చేసుకుని చివరకు ముఖం చాటేశాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ కరుగోరుమిల్లిలో గూడూరు పెద్దిరాజు ఇంటి గేటు వద్ద దేవళ్ల వెంకటలక్ష్మి శుక్రవారం భైఠాయించి నిరసన తెలిపింది. ఈ సందర్భంగా ఆమె విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. 2018 సంవత్సరంలో కువైట్‌లో కరుగోరుమిల్లికి చెందిన గూడూరు పెద్దరాజు తనకు పరిచయం అయ్యాడని, ఆ పరిచయం ప్రేమగా మారిందని తెలిపింది. 2020లో పెద్దిరాజు తనను పెళ్లి చేసుకున్నాడని వీడియో కూడా ఉందని తెలిపింది. అయితే కువైట్‌లో ఉంటున్న తనను పాలకొల్లు ఎల్అండ్‌టిలో ఇల్లు అద్దెకు తీసుకుని వేరే కాపురం పెట్టాడని, తన దగ్గరున్న రూ.19 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఏడాది జనవరిలో కరుగోరుమిల్లి వచ్చి లారీ కూడా కొనుగోలు చేశాడని, కొన్ని రోజుల నుంచి పెద్దిరాజు ముఖం చాటేశాడని, తనకు న్యాయం చేయాలని కోరింది. న్యాయం చేయాలని ఆచంట పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించానని, అవహేళన చేశారని ఆమె వాపోయింది. పెద్దిరాజుకు ఇదివరకే పెళ్లయ్యిందని, ఒక పాప కూడా ఉందని, ఎక్కడికి వెళ్లినా న్యాయం జరగదని పోలీసులు అంటున్నారని వాపోయింది. తనను పెద్దిరాజు జుట్టు పట్టుకుని కొట్టాడని తెలిపింది. తనకు న్యాయం జరగకపోతే పెద్దిరాజు ఇంటి ముందే ఆత్మహత్య చేసుకుంటానని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్



మాట్లాడుతున్న ముదునూరి ప్రసాదరాజు

70 సంవత్సరాలుగా అంతంత మాత్రమే అభివృద్ధికి నోచుకున్న నరసాపురం పట్టణాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయడం జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం పురపాలక సంఘం పరిధిలో శ్రీహరిపేట సచివాలయం పరిధిలో 1, 2, వార్డులకు సంబంధించి శుక్రవారం జరిగిన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. నరసాపురం మున్సిపాల్టీ ఏర్పడి 70 సంవత్సరాలైందన్నారు. తాగునీరు ప్రజలకు అందించాలని పట్టణంలో రూ. 82 కోట్లతో శాశ్వత పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రూ.84 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను త్వరలో చేపడతామన్నారు. పట్టణంలో అంతంత మాత్రంగానే ఉన్న బస్టాండు, ప్రభుత్వాసుపత్రి, ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు కాటన్ పార్క్‌ను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో రెండు వార్డుల్లో కలిపి రూ.32.81 కోట్లతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి డ్వాక్రా రుణాలను అందించి వారు కట్టాల్సిన బ్యాంకు వడ్డీని కూడా ప్రభుత్వమే భరించి నాలుగు విడసలుగా కట్టడం జరుగుతోందన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, ఒకటి రెండు వార్డులో జరిగిన అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రగతి వివరాలు తెలిపే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, భూసారపు జయప్రకాష్, వైకెఎస్ బొంతు రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

ప్రజాశక్తి - పోడూరు

వద్దిపర్రు వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఎంపియుపి స్కూల్ వద్ద విద్యార్థులకు శుక్రవారం రక్తహీనతపై అవగాహన కల్పించి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయిని నిరోగి.రమ, పాఠశాల సిబ్బంది, సిహెచ్ఒ అనిత, ఆశా వర్కర్లు విజయలక్ష్మి, నిర్మల కుమారి, విమలకుమారి పాల్గొన్నారు.



కొత్త స్తంభం ఏర్పాటు చేస్తున్న ఎఇ రాజీవ్

కరెంట్ స్తంభం ఏర్పాటు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పెంకుళ్లపాడు వద్ద పాడైపోయిన కరెంటు స్తంభం గురించి ఈనెల 22వ తేదీన ప్రజాశక్తిలో ప్రచురించిన 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' కథనానికి ఎలక్ట్రికల్ ఎఇ రాజీవ్ స్పందించారు. పగిలిపోయిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా శేషాద్రి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మున్సిపల్ కమిషనర్‌గా తిరిగి బిఆర్ఎస్ శేషాద్రి గురువారం బాధ్యతలు చేపట్టారు. గత నెల 27న ఆయనను అమరావతి డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు బదిలీ చేయగా పాలకొల్లుకు పూర్తిస్థాయి కమిషనర్ లేరని విమర్శల నేపథ్యంలో తిరిగి ఆయననే కమిషనర్‌గా నియమించారు. ఆయనను మున్సిపల్ ఇంజినీర్ ఎం.సాంబశివుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివా స్‌రాజు అభినందించారు.